క్లుప్తంగా

వాహనాల తనిఖీ



మహదేవపూర్: మండలంలోని రాపెల్లికోట క్రాసు రోడ్డు వద్ద ఎస్సై రాజ్‌కుమార్ శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించి వదిలేశారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

మల్హర్: నూతన పట్టా పాస్‌బుక్‌లు జారీ కానీ రైతులు వానాకాలం పంటల సాగు చేసిన వివరాలను రైతులు వారి ఆధార్ కార్డులతో సంబంధిత క్లస్టర్ ఏఈఓల దగ్గర నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వరి, పత్తి సాగు చేసిన రైతులకు పంట వివరాల నమోదు చేయకుంటే పంటలను అమ్ముకోవాటనికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వెల్లడించారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ



మహదేవపూర్: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ లక్ష్మిరాజయ్య శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను, వంట, తరగతి గదులను పరిశీలించారు. తమకు గణిత ఉపాధ్యాయుడు లేడని తెలుపగా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన



పలిమెల: పలిమెల మండలం మోదేడ్ గ్రామంలో ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులతో స్పెషల్ వీఓ సమావేశాన్ని అధికారులు శనివారం నిర్వహించారు. అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా స్వయం ఉపాధిపై, 5 థీమ్స్, 39 ఇండికేటర్ల గురించి స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు అవగాహన కల్పించారు. పాడి గేదెల పెంపకం, పండ్ల తోటల పెంపకంతో కలిగే లాభాల గురించి వివరించారు. సమావేశంలో ఎంపీఎం రవీందర్, సర్పంచ్ చిడెం నాగయ్య, పంచాయతీ కార్యదర్శి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కోతులు అడ్డు రావడంతో అదుపు తప్పిన కారు..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం–అన్నారం మూల మలుపు సమీపంలో రోడ్డు పైన కోతుల గుంపు అడ్డురావడంతో కారు అదుపుతప్పి పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన కట్ట శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఆయకు కుటుంబ సభ్యులతో కాళేశ్వరం వచ్చి తిరగి వెళుతుండగా కోతుల గుంపు రోడ్డు అడ్డు రావడంతో కారు అదుపు తప్పడంతో శ్రీధర్ కాళ్లకు, చేతులకు గాయాలు అయ్యాయి. మిగితా వారు స్వల్పంగా గాయపడ్డారు. మహదేవపూర్ ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేసి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

అధ్వానంగా రహదారులు



సింగంపల్లి యత్నారం మధ్యలో దెబ్బతిన్న రహదారి



గుంతలు ఏర్పడ్డ బోర్లగూడెం నర్సింగాపూర్ వెళ్లే రహదారి

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మహాముత్తారం: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో చాలా చోట్ల రోడ్లు అధ్వానంగా మారాయి. వరదలకు రహదారులు కోతకు గురయ్యాయి. ప్రయాణికులు బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలోపెట్టుకుని ప్రయాణిస్తున్నారు. వర్షానికి మండలంలోని యత్నారం, నిమ్మగూడెం, సింగంపల్లి వేళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమయింది. అదే విధంగా నర్సింగాపూర్ నుంచి బోర్లగూడెం వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వర్షాలకు దారిపొడవున రోడ్డు కోతకు గురికావడమే కాకుండా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు ఈ రహదారుల గుండా ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలోపెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు , పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని నర్సింగాపూర్, బోర్లగూడెం, నిమ్మగూడెం, యాత్నరం నుంచి సింగంపల్లి వెళ్లే రహాదారులు పూర్తిగా దెబ్బతిని రవాణాసౌకర్యం ఇబ్బందిగా మారింది. రాత్రి సమయంలో ద్విచక్రవాహనాలు నడపాలంటే నరకయాతన ఏర్పడుతుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలి.

– రాజ్‌కుమార్, సింగంపల్లి

సర్వాయిపేటలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పలిమెల: పలిమెల మండలం సర్వాయిపేటలో మహదేవ్‌పూర్ ఐసీటీసీ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సర్వాయిపేటలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మలేరియా, టైఫాయిడ్, హెచ్‌ఐవీ, వైరస్, తదితర వ్యాధుల నిర్ధారణకు జ్వర పీడితుల నుంచి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. 36మంది రక్త నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణకు పంపించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జనగామ సమ్మక్క, అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రఘురాం, మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఐసీటీసీ కౌన్సిలర్ గారె రమేష్, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ తెర్లుమద్ది శ్రీనివాస్, ఏఎన్ఎం పద్మాదేవి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, లింక్ వర్కర్ స్కీం ఓఆర్‌డబ్ల్యూ సూపర్‌వైజర్ రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణపతి, ఆశ కార్యకర్త సరస్వతి, అంగన్‌వాడీ కార్యకర్త ఎలేంద్ర, ఐకేపీ కోఆర్డినేటర్ బీ.స్వామి, కారోబార్ సడవలి, తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీ

కాటారం: మండలంలోని పలు ముదిరాజ్ సొసైటీలకు శనివారం మండల కేంద్రంలో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను పంపిణీ చేశారు. మూడు సొసైటీలకు సంబంధించి ప్రభుత్వం ద్వారా 9.96 లక్షల చేప పిల్లలను పెంపకానికి అందజేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ తెలిపారు. చేప పిల్లల పెంపకంలో తగు జాగ్రత్తలు పాటించాలని సొసైటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీల సభ్యులు ఓలపు రాజబాబు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనర్హులను తొలగించాలని వినతి



ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రభాకర్

మల్హర్: ఇటీవల విడుదలైన గృహలక్ష్మి పథకంలోని జాబితాలో అనర్హులను తొలగించి, అర్హులైన వారికి న్యాయం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముడతనపల్లి ప్రభాకర్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ విక్రమ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు అనర్హులకు జాబితాలో చోటు కల్పించారని ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారును ఎంపిక చేయాల్సిన ప్రక్రియను బీఆర్ఎస్ నాయకులే అధికారాన్ని అడ్డు పెట్టుకోని వారి బంధువులకు, కుటుంబ సభ్యలకు జాబితాలో చోటు కల్పించి ప్రోసిడింగ్‌లను ఇప్పించి పథకాలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. మండల ఉపాధ్యక్షుడు రాగం సతీష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ నిషాన్‌పాషా, మండల కార్యదర్శి ఊట్నూరి శ్రావణ్, గ్రామస్తులు సంతోష్, సురేష్, రాజమల్లు, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

చిట్యాల: ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ.. క్లస్టర్ ఆపరేటర్లు సురేష్, భాస్కర్, మహేష్ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతిలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీలలో జరిగే ప్రతి పనిని ఆన్‌లైన్ కంప్యూటరీకరణ గత తొమ్మిది సంవత్సరాలుగా చేస్తున్న కనీసం ఈ కంప్యూటర్ ఆపరేటర్లను పట్టించుకున్న పాపాన లేదన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ ఆపరేటర్‌లను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అన్వర్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అంటూ ప్రచారం చేసి, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారని ప్రచారం చేసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకుడే కానీ, ప్రధాన కార్యదర్శి కాదని అన్నారు. ఇప్పటికైనా సత్యాలనే ప్రచారం చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలని, తప్పుడు ప్రచారంతో ప్రజల్లోకి వెళితే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని సూచించారు. ఈ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవిందర్, యూత్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మొగుళ్లపల్లి: పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రంగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రంగాపురానికి చెందిన శ్రీనివాస్ (45) మూడు సంవత్సరాల నుంచి భూమి కౌలుకు తీసుకోని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ సంవత్సరం మిర్చి పంట వేశాడు. అధిక వర్షాల వల్ల మిర్చి పంట దెబ్బతింది. దీంతో మనస్థాపనికి గురై పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

స్వచ్ఛతలో గ్రామాలు ముందుండాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛతలో గ్రామాలు ముందుండాలని ఎంపీడీఓ సత్యాఅంజనేయప్రసాద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర శనివారం తాడ్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని బస్‌స్టేషన్, సామాజిక మరుగుదొడ్డి పరిసరాలు, ఎంపీడీఓ కార్యాలయంలో సామూహిక శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కేజీబీవీ విద్యార్థులకు గ్రామపంచాయతీ నిర్వహిస్తున్న కార్యకలాపాలు, గ్రామంలో చెత్తసేకరణ వంటి పారిశుద్ధ్య పనులపై అవగాహన కల్పించారు.

గణేశ్ మండపాల వద్ద అన్నదానం



టేకుమట్ల: అన్నదాన కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి



మహాముత్తారం: నర్సింగాపూర్‌లో..

టేకుమట్ల: మండల కేంద్రంలోని కృష్ణకాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో శనివారం ఉత్సవ కమిటీ సభ్యుడు ఎరివెల్లి రాజేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పంగిడిపల్లి పంచాయితీ కార్యదర్శి సురేష్, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్, నాగరాజు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల్లోని గణపతి మండపాల వద్ద శనివారం ఆరవ రోజు అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. కనుకునూర్, నర్సింగాపూర్, బోర్లగూడెం గ్రామాల్లో కుంకుమ పూజలతోపాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మహాముత్తారం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఫలితాలు ప్రకటించాలి

భూపాలపల్లి రూరల్: సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియా ఆస్పత్రులలో, డిస్పెన్సరీలలో సిబ్బంది నియామకానికి రాసిన పరీక్ష ఫలితాలను యాజమాన్యం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. సిబ్బంది కొరత తీర్చడానికి సంస్థలో పనిచేసే అంతర్గత ఉద్యోగులను వార్డు అసిస్టెంట్ ట్రినీలుగా నియమించి వీరందరికీ ఒక సంవత్సరం శిక్షణ ఇచ్చి ఆగస్టు 11న పరీక్షలు సంస్థ వ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహించి నెల రోజులు గడుస్తున్నప్పటికీ సింగరేణి సంస్థ ఫలితాలు ప్రకటించకపోవడంతో పరీక్ష రాసిన అభ్యర్థులు తమకు రావలసిన గ్రేడ్ హెచ్ పర్మినెంట్ లెటర్ల కోసం వేచి చూస్తున్నారన్నారు. వాస్తవానికి ఆగస్టు నెలలోనే ఈ ప్రక్రియంతా పూర్తి చేసి సెప్టెంబర్ ఒకటవ తేదీ వరకు పరీక్ష రాసిన అభ్యర్థులందరికీ ఉత్తర్వులతో పాటు పదోన్నతి పత్రాలు కూడా జారీ చేయాల్సి ఉండగా, ఇంతవరకు యాజమాన్యం స్పందించకపోవడంతో అభ్యర్థులందరూ ఆందోళనకు గురవుతున్నారన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె నోటీస్ అందజేస్తున్న రమేశ్, కార్మికులు

కాటారం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ చేపడుతున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అడప సంతోష్ డిమాండ్ చేశారు. ఈ నెల 28 నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టనున్న సమ్మెకు సంబంధించి ముందస్తు నోటీసును కార్మికులతో కలిసి రమేశ్ శనివారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో సమ్మె అనివార్యమైందన్నారు. కార్మికులు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై రూ.2వేలు అదనంగా ప్రకటిస్తూ సీఎం కేసీఆర్ జీఓ 8 విడుదల చేశారని తెలిపారు. పెరిగిన జీతం ఇంతవరకు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెంచిన జీతాలకు, పెండింగ్ బిల్లులు బడ్జెట్ కేటాయించడంతో పాటు గుడ్ల అదనంగా బడ్జెట్ ఇవ్వాలని అన్నారు. పలు డిమాండ్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు కార్మికులు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు స్వరూప, పద్మ, మధునక్క, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ వెంకన్న

చిట్యాల: మండలంలోని ఏలేటిరామయ్యపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థక శాఖ చిట్యాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా పశువైద్యుడు డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. రైతులు గోపాలమిత్రల సేవలను వినియోగించుకోవాలని కోరారు. పశువులు ఎదకు వచ్చినప్పుడు కృత్రిమగర్భాదారణ చేయడం వలన మేలు జాతి దూడలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. దూడలకు నట్టల నివారణ మందులు తాగించాలని అన్నారు. ఈ శిబిరంలో 25 పశువులకు గర్భాదారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఎస్ డాక్టర్ మహతి, సర్పంచ్ ఏలేటి సరోజన లింగారెడ్డి, గోపామిత్ర సూపర్‌వైజర్ ప్రకాశ్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది నెహ్రూనాయక్, సుజాత, లక్ష్మణ్, సునీత, మహేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీవాలు మృతి



కాళేశ్వరం: మృతి చెందిన దుక్కిటెద్దు



టేకుమట్ల: మృతి చెందిన పాడి గేదె

టేకుమట్ల: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన రేగొండ మండలంలోని రాయపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాయపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు సదయ్య గేదె రోజు వారిలాగే మేతకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు తెలిపాడు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం చంద్రుపల్లి గ్రామశివారులో గోమాస లక్ష్మణ్ అనే రైతులకు చెందిన దుక్కిటెద్దు విద్యుదాఘాతంలో శనివారం మృతి చెందింది. శుక్రవారం రాత్రి ఉరుముల మెరుపులతో కురిసి వర్షానికి స్తంభంపైన పిడుగు పడటంతో ఇన్సులేటర్ పగిలి వైర్లు తెగిపడ్డాయి. దీంతో వైర్లకు విద్యుత్ సరఫరా కావడంతో మేతకు వెళ్లిన దెక్కిటెద్దు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు రైతు తెలపాడు. రూ. 40వేల వరకు విలువ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

కాటారం: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన కాటారం మండలం శంకరాంపల్లిలో శనివారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. బోనగిరి శ్రీకాంత్ అనే రైతుకు చెందిన పాడి గేదె బీసీ కాలనీలోని విద్యుత్ స్తంభం ఎర్త్ వైర్‌ను ప్రమాదవశాత్తు తాకి షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు శ్రీకాంత్ కోరారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం చోటు చేసుకొందని సర్పంచ్ అంగజాల అశోక్ ఆరోపించారు. స్తంభం వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని పలుమార్లు కోరినప్పటికి స్పందించకపోవడంతోనే ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.



కాటారంలో..

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మల్హర్: మాట్లాడుతున్న సరస్వతి



కాటారంలో..

మల్హర్: పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. పోషణ మాసం సందర్భంగా మండలంలోని కొయ్యూరు పీవీనగర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రతీ రోజు ఆకుకూరలతో వండిన అన్నం, గుడ్లు, పాలు తీసుకోవాలని, రెండు గంటలు విశ్రాంతి తీసుకోవాలని వెల్లడించారు. బిడ్డ పుట్టగానే ముర్రు పాలు పట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సూజత, ఆశ కార్యకర్త వసుమతి, అంగన్‌వాడీ కార్యకర్త రజిత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కాటారం: పోషణ మాసోత్సవంలో భాగంగా మండలంలోని ఒడిపిలవంచ గ్రామపంచాయతీ పరిధిలో గల ఆల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సుపోషణ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరల్లో అనేక పోషక విలువలు ఉంటాయని వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషక ఆహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మమత అనే గర్భిణికి సీమంతం, ఆర్య అనే చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అపర్ణ, ఏఎన్ఎం, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న గండ్ర జ్యోతి

టేకుమట్ల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇటీవల పలు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి శనివారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందించి, భరోసా కల్పించారు. ఆమె వెంట ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, సర్పంచ్‌లు కొలిపాక రాజయ్య, తదితరులు ఉన్నారు.